సిద్ధివినాయకుడిని దర్శించుకున్న విజయేంద్రస్వామి

న్యాల్‌కల్, ఫిబ్రవరి 16: కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర మహాస్వామిజీ విజయయాత్రలో భాగంగా గురువారం రాత్రి మండలంలోని రేజింతల్ సిద్ధివినాయక ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆలయంలో సిద్ధి వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగద్గురు మహాత్రిపురసుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామివారి సంస్థాన పూజ లు చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్ రేజింతల్, ప్రధా న కార్యదర్శి అల్లాడి నర్సింహులు, మేనేజర్ కృష్ణ, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

జగద్గురు విజయేంద్ర మహాస్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై అవగాహన పెంపొందించేందుకు కేజీబీవీ విద్యార్థులకు అగ్ని మాపకశాఖ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం సంగారెడ్డి మండలం కాశీపూర్, సదాశివపేట కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులకు అగ్ని ప్రమాద నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో జిల్లాలోని అన్ని కేజీబీవీ పాఠశాలల్లో అగ్నిప్రమాదల నివారణపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

సీఎం కేసీఆర్ హయాంలోనే పల్లెలు అభివృద్ధి

గుమ్మడిదల, ఫిబ్రవరి 16: రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో చిన్న గూడేలు, పల్లెలు, తండాలు నూతన పంచాయతీలుగా అవతరించి ఎంతో అభివృద్ధి చెందాయని ఎంపీపీ సద్దిప్రవీణావిజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వీరన్నగూడెం గ్రామపంచాయతీలో జీపీ కార్యదర్శి ప్రత్యూష ఆధ్వర్యంలో గత పాలకవర్గాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పొన్నబోయిన మమతా వేణు, మాజీ ఉపసర్పంచ్ దేశబోయిన కుమార్, మాజీ వార్డు సభ్యులు మోహన్, మనీలాగణేశ్, ఇజాజ్‌పాషా,యాదగిరి, లావణ్యరాజు, రేష్మాపాషు, సమీనా షఫీలకు జ్ఞాపికలు అందజేశారు. నాయకుడు హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

వీరన్నగూడెంలో మాజీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎంపీపీ సద్దిప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి ప్రత్యూష

విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

రాయికోడ్, ఫిబ్రవరి 16 : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విశ్వకర్మ కులవృత్తుల వారు తప్పకుండా ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎంఎం. షరీఫ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన రాయికో డ్ ఎం పీడీవో కార్యాలయంలో ఏర్పాటు సమవేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాం తాల్లో ఉన్న విశ్వకర్మ కులవృత్తుల వారు తప్పకుండా అన్‌లైన్‌లో దరఖాస్తులు నమో దు చేసుకోవాలన్నారు. ఈ పథకాన్ని పంచాయతీ కార్యదర్శులు ప్రచారం చేయించాలన్నారు. ప్రతి గ్రామంలో దండోరా వేయించాలని సూచించారు.

విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ

కల్హేర్, ఫిబ్రవరి 16: సిద్దిపేట పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, సిద్దిపేట్ జిల్లా పీఆర్టీయూటీ ఎస్ మాజీ అధ్యక్షుడు వంగ మహేందర్‌రెడ్డి కృష్ణాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందంగా పదవీవిరమణ చేసిన వంగ మహేందర్‌రెడ్డిని విద్యార్థులకు దుస్తులు అందించాలని కోరగా, వెంటనే 30 మంది విద్యార్థులకు అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారన్నారు.ఉపాధ్యాయ బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

క్రీడాదుస్తులతో విద్యార్థులు

అంగన్‌వాడీలను ప్రతిరోజూ నిర్వహించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి రోజూ తెరిచి ఉంచాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి లలితాకుమారి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సీపీడీవోలు, సూపర్‌వైజర్లు, పోషణ్ అభియాన్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మెనూ ప్రకారం అందించాలన్నారు. పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించి, అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.


అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న సేవలను తెలుసుకుంటున్న సంక్షేమశాఖ అధికారి

బొల్లారం : ప్రధాన చౌరస్తా వద్ద ఆటో కార్మికులతో కలిసి ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కంది : ఎద్దుమైలారం ఓడీఎఫ్ గేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

గుమ్మడిదల : కానుకుంట రోడ్డుపై ఆందోళన చేస్తున్న ఆటోడ్రైవర్లు

కదిలింది కార్మికలోకం

సమస్యలు పరిష్కరించాలని కార్మికు లు కదం తొక్కారు. కార్మిక వ్యతిరేక విధానాలపై సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకంతో ఉపాధిని కోల్పోయి ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆం దోళ న వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తుందన్నారు. మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించిందన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకవచ్చిన లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని, పెరిగిన ధరలకు కనుగుణంగా కార్మికులకు కనీస వేతన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

- సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, ఫిబ్రవరి 16

జహీరాబాద్ పట్టణంలో కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

సంగారెడ్డి కలెక్టరేట్ : కలెక్టరేట్‌లోని ఏ బ్లాక్ వద్ద ధర్నా చేస్తున్న టీఎన్‌జీవో నాయకులు, ఉద్యోగులు

జహీరాబాద్ : కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

అందోల్ : జోగిపేట ర్యాలీలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, నాయకులు

వైభవంగా రథసప్తమి వేడుకలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 16 : రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్తలు నర్సింహాచార్యులు, కేవీ. రంగనాథ చార్యుల ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో..

న్యాల్‌కల్, జనవరి 28 : మండలంలోని రాఘవపూర్ గ్రామ శివారులోని సరస్వతీదేవి పంచవటీ క్షేత్రంలో మూడు రోజులుగా జరుగుతున్న వసంత పంచమి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక క్షేత్ర పీఠాధిపతి కాశీనాథ్ బాబా ఆధ్వర్యంలో క్షేత్ర ప్రధాన అర్చకుడు అయ్యప్పస్వామి పర్యవేక్షణలో సరస్వతీదేవి, సాయిబాబా, దత్తత్రేయ, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, గంగామాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు భజనలు, కీర్తనలతో సూర్యభగవాన్ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుమ్మడిదల : కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

అందోల్‌లో..

అందోల్, ఫిబ్రవరి 16 : రథసప్తమి వేడుకలను శుక్రవారం జోగిపేటలో నిర్వహించారు. జోగినాథస్వామి ఆలయంలో స్వా మివారికి, రథానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జోగినాథస్వామి ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బొల్లారంలో..

బొల్లారం, ఫిబ్రవరి 16 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన ఆలయాల్లో శుక్రవారం రథసప్తమి వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ బస్తీలోని సూర్య ఆలయంలో తెల్లవారుజాము నుంచే మహిళలు సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు.

శివపార్వతుల కల్యాణం

హత్నూర, ఫిబ్రవరి 16: హత్నూర మండలం దౌల్తాబాద్‌లోని భవానీమాత స్ఫటిక లింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివ పార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. సాయంత్రం పాచిబండ్ల ఊరేగింపు, పల్లకీసేవ నిర్వహించారు.

శ్రీనివాస్‌నగర్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 16 : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నా రు. శుక్రవారం ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ 7వబ్లాక్‌లో కార్పొరేటర్ బస్తీ దర్శన్ నిర్వహించారు. బస్తీలో తిరుగుతు స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దాస్, శ్రీరాములు, మల్లేశ్, శ్రీను, మోహన్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

జిన్నారం, ఫిబ్రవరి 16 : జిన్నారంలో నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ శివాలయానికి పలువురు విరాళాలు అందజేశారు. జిన్నారం గ్రామానికి చెందిన గుల్లయ్యగారి వెంకటేశంగౌడ్, నీలం నర్సింహులు రూ. 50వేల విలువైన సిమెంట్, హైదరాబాద్ కోఠికి చెందిన జనాబాయి రూ. 10,116 నగదు అందజేశారు.

మత్స్య సహకార ఎన్నికలకు ఓటరు జాబితా సిద్ధం

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 16: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల ప్రతిపాదనలు పంపించేందుకు ఓటరు జాబితాను పరిశీలించి ప్రచురించినట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి సతీశ్ తెలిపారు. శుక్రవారం జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అడహక్ కమిటీ సమావేశాన్ని సంగారెడ్డిలో నిర్వహించారు. జాబితాలోని వివరాలపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఈ నెల 19లోగా ఆధారాలతో లిఖిత పూర్వకంగా జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

జిన్నారం ఎంపీడీవోగా అరుణారెడ్డి

జిన్నారం, ఫిబ్రవరి 16: ఎంపీడీవోగా అరుణారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆమె ఘట్‌కేసర్ నుంచి జిన్నారం ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన రాములు వికారాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

మున్సిపాలిటీకి ట్రాక్టర్ బహూకరణ

బొల్లారం, ఫిబ్రవరి16: మున్సిపాలిటీ అభివృద్ధికి పరిశ్రమల సహకారం అభినందనీయమని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కోలన్ రోజాబాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పారిశ్రామిక వాడలోని అమోజోన్ కెమికల్ పరిశ్రమ యాజమాన్యం చెత్త సేకరించడానికి కొనుగోలు చేసిన నూతన ట్రాక్టర్‌ను చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి సమక్షంలో మున్సిపాలిటీకి అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పరిశ్రమలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి అభివృద్ధిలో భాగస్వాములు కావడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నిర్మల, కౌన్సిలర్ సంతోషారెడ్డి, ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆనందరావు, వైస్ ప్రెసిడెంట్ రాయుడు, పరిశ్రమ ప్రొడక్షన్ మేనేజర్ చంద్రశేఖర్, హెచ్ఆర్ మనోహర్, రాధాకృష్ణ, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి నూతన ట్రాక్టర్‌ను అందజేస్తున్న అమోజోన్ పరిశ్రమ ప్రతినిధులు

పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత

- రూ.8 వేల చొప్పున 205 మందికి ప్రోత్సాహకం
- ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ యాదగిరి

విద్యార్థులకు మలబార్ స్కాలర్‌షిప్‌ను అందజేస్తున్న ఆర్జేడీ యాదగిరి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతను అందించి వారి ఉన్నత విద్యాభివృద్ధికి మలబార్ గోల్డ్ యాజమా న్యం సహకారం అందించడం అభినందనీయమని ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ యాదగిరి అన్నారు. శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యాదగిరి మాట్లాడుతూ జిల్లాలోని సంగారెడ్డి తారా ప్రభుత్వ కళాశాలకు చెందిన 84 మంది విద్యార్థులు, పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 121మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ. 8 వేల విద్యా స్కాలర్‌షిప్‌ను అందించి పేద వి ద్యార్థుల అభివృద్ధికి మలబార్ యాజమాన్యం తోడ్పాటు అందిస్తున్న ట్లు వివరించారు. కార్యక్రమంలో మలబార్‌గోల్డ్ స్టోర్ హెడ్ దీపక్ కుమార్, తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. వెంకటేశం, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ అల్లంరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ పద్మజ, డాక్టర్ రాధిక, డాక్టర్ యోగిబాబు, డాక్టర్ పూనమ్, డాక్టర్ లచ్చయ్య, డాక్టర్ జానారెడ్డి, కృష్ణ, మలబార్ గోల్డ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 16: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంగ్ విభాగ్ సేవా ప్రముఖ్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం రథ సప్తమి సందర్భంగా భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజీలో ఉన్న విద్యాభారతీ హైస్కూల్‌లో ఆర్ఎస్ఎస్, జయ గురుదత్త ఆశ్రమం, స్వాధ్యాయ పరివార్ ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు, యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిందం నర్సింహులు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐజీ విద్యాభారతి స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఖాతాల్లో నగదు జమ

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : 'ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్'కు ఎంపికైన 92 మంది విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో రూ. 10వేల నగదును డీఎస్టీ మంత్రిత్వశాఖ ద్వారా జమ చేసినట్లు డీఈవో వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత గైడ్ టీచర్లు గమనించి వాటిని ప్రాజెక్టు, నమూనా తయారీకి మాత్రమే అవసరమైన మేరకు విద్యార్థుల ద్వారా వినియోగించాలని సూచించారు. ఆయా ప్రాజెక్టులను ఏప్రిల్ 23, 24లోగా సిద్ధం చేసుకోవాల్సిందిగా స్పష్టం చేశారు. మండల విద్యాధికారులు ఈ విషయాన్ని గమనించి తమ పరిధిలోని పాఠశాలలకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

సాహెబ్ ఉర్సు ప్రారంభం

న్యాల్‌కల్, ఫిబ్రవరి 16 : మతసామరస్యానికి ప్రతీకగా పీర్‌గైబ్ సాహెబ్ దర్గా ఉర్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మాలి పటేల్ ఇంటి నుంచి భాజాభజంత్రీల హోరుతో గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. అనంతరం దర్గాలో దట్టిని, గంధాన్ని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశా రు. ప్రజాప్రతినిధులు,నాయకులు ఇసాంపటేల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రాజా రమేశ్

కల్హేర్, ఫిబ్రవరి 16 : నిజాంపేట్ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రాజా రమేశ్‌కు కల్హేర్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. కల్హేర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన బాలశంకర్ కోహీర్ మండలానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు రాజా రమేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇద్దరు తహసీల్దార్లను సన్మానించారు.

బీఆర్ఎస్ నాయకుడి మృతి

సిర్గాపూర్, ఫిబ్రవరి 16 : మండల పరిధిలోని గర్దెగాం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొండ మారుతి (51) గుండె పోటుతో మృతి చెందారు. శుక్రవారం మధ్యాహ్నం హఠాత్తుగా చాతీలో నొప్పి రావడంతో దవాఖానకు తీసుకువెళ్లే లోగా ప్రాణాలు కోల్పోయారని కుటుంబీకులు తెలిపారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సంజీవరావు, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రాఘవరెడ్డి మృతుడి కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. మంచి నాయకుడిని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు.

కల్హేర్ ఉపాధి ఏపీఎంగా శ్యామ్

కల్హేర్, ఫిబ్రవరి 16 : ఉపాధి హామీ పథకం ఏపీఎంగా శ్యామ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విధులు నిర్వహించిన ఏపీఎం నర్సింహులు కొన్ని నెలల కింద కంగ్టి మండలానికి బదిలీ అయ్యారు. వట్‌పల్లిలో విధులు నిర్వహించిన శ్యామ్‌ను కల్హేర్‌కు బదిలీ చేశారు. ఉత్తర్వు లేఖను ఎంపీడీవో శ్రీనివాస్‌కు అందజేశారు.

కోహీర్ తహసీల్దార్‌గా బాలశంకర్

కోహీర్, ఫిబ్రవరి 16: కోహీర్ మండల తహసీల్దార్‌గా శుక్రవారం బాలశంకర్ బాధ్యతలు స్వీకరించారు. కల్హేర్ మండ లం నుంచి బదిలీపై కోహీర్‌కు వచ్చిన బాలశంకర్ విధుల్లో చేరారు. కోహీర్‌లో ఆరు నెలల నుంచి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన శాంతకుమారి సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యా రు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ, సర్వేయర్ బాల్‌రాజ్ ఉన్నారు.

నేడు కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు

అందోల్, ఫిబ్రవరి 16 : అందోల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్య లో హాజరుకావాలని కోరారు.

జిన్నారం తహసీల్దార్‌గా భిక్షపతి

జిన్నార, ఫిబ్రవరి 16 : జిన్నారం తహసీల్దార్‌గా భిక్షపతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అంబర్‌పేట్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన రవికుమార్ వారం రోజుల కింద యాదాద్రి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు. ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ, సర్వేయర్ రామభద్ర,సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ప్రోత్సాహకం

బొల్లారం, ఫిబ్రవరి 16 : జిల్లా స్థాయికి ఎంపికైన కబడ్డీ క్రీడాకారిణి ప్రతిభను అభినందిస్తూ బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి ప్రోత్సాహకంగా రూ. 5వేలు అందజేశారు. బొల్లారానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని ప్రీతియాదవ్ మండల స్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చింది. ఈ సందర్భంగా విద్యార్థినిని, కోచ్‌ను సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభు, ఉదయ భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హత్నూర, ఫిబ్రవరి 16 : హత్నూర మండలం శేర్కాన్‌పల్లి శివారులోని పలుగు పోచమ్మ ఆలయ పాలకమండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఈవో శశిధర్ తెలిపారు. ఆలయ ధర్మకర్తల ఎన్నిక కోసం దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆసక్తిగల ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.